అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

దమ్మన్నపేటలో దేవయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గంభీరావుపేట, డిసెంబర్ 6: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసానిచ్చారు. సముద్రలింగాపూర్ సర్పంచ్ మోతె రాజిరెడ్డి తండ్రి వెంకటరాములు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని, దమ్మన్నపేటలో అరుట్ల పోచిరెడ్డి, ఆవునూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దేవయ్య కుటుంబానికి రామన్న పరామర్శ

బీఆర్ఎస్ సర్కారు మరోసారి అధికారంలోకి రాకపోవడాన్ని తట్టుకోలేక రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఆవునూరి దేవయ్య గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఈ క్రమంలో బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. పార్టీ కోసం చురుకుగా పని చేసిన దేవయ్య అకాల మరణం దురదృష్టకరమని కేటీఆర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగ య్య, మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ కొత్తింటి హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ గోగు లింగం యాదవ్, సర్పంచులు సిరిగిరి లక్ష్మి, బాల్యానాయక్, ఉప సర్పంచులు అరుట్ల అంజిరెడ్డి, దేవేంద్రం, నాయకులు వంగ సురేందర్‌రెడ్డి, లింగన్నగారి దయాకర్‌రావు, కమ్మరి రాజారాం, కామిడి సదాశివరెడ్డి, అంబర్‌సింగ్, వేణు, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రలింగాపూర్‌లో సర్పంచ్ తండ్రి వెంకటరాములు చిత్రపటానికి నమస్కరిస్తున్న కేటీఆర్

అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా..

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని, డిసెంబర్ 6: ఓటమికి గురయ్యామని బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటానని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ భరోసానిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాను జడ్పీ చైర్మన్ పదవీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉంటే పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆ ఆలోచన విరమించుకోవాలని సూచించారని, అదే విధంగా పార్టీ కార్యకర్తల విజ్ఞప్తి మేరకు రాజీనామా చేసే ఆలోచనను వెనక్కి తీసుకున్నానని చెప్పారు. 24 గంటలు రాజగృహ ఉంటుందనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మంథనికి వచ్చారు. భూపాలపల్లి జడ్పీ వైర్‌పర్సన్ జక్కుల శ్రీహర్షిణితో కలిసి పాత పెట్రోల్‌పంపు చౌరస్తా నుంచి పూలే చౌరస్తా వరకు గల మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంథని రాజగృహలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తితో ఓటు విలువ తెలుపేందుకు కృషిచేస్తానని, మహనీయుల స్ఫూర్తి ఆలోచన విధానాలతో ముందుకెళ్తానన్నారు. బహుజనుల రాజ్యాధికారం కోసం పాటుపడుతానని, అదే తన ఏ జెండా అని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేశారని ఆక్షేపించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని, ₹900కోట్లు వెలికితీసి ప్రజలకు పంచిపెట్టాలని సవాల్ విసిరారు. లేదంటే ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీలు తనవేనని అనేక ఆరోపణలు చేసిన ఆ నాయకులు లారీలను ఆపుతారో.. లేక తనవని నిరూపిస్తారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కేసీఆర్‌ను కలిసిన సుంకె రవిశంకర్

చొప్పదండి, డిసెంబర్ 6: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సుంకె మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కార్యకర్తలకు అండగా ఉండాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఒత్తిడి తేవాలని, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కేసీఆర్ సూచించారని చెప్పారు.

అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

- బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన దార్శనికుడు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి

కోరుట్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, డిసెంబర్ 6: రాజ్యాంగాన్ని రచించి అన్నివర్గాలకు హక్కులు ప్రసాదించిన అంబేద్కర్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఉద్బోధించారు. కోరుట్ల కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్‌నగర్‌లో 67వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన గొప్ప త్యాగశీలి అంబేద్కర్ అని కొనియాడారు. జీవితం తాత్కాలికమని, రాజ్యాంగం శాశ్వతమన్న అంబేద్కర్ దేశ ప్రజల కోసం రాజ్యాంగాన్ని రచించి ప్రజాస్వామ ఫలాలను పేదలకు పంచిన మహనీయుడన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి కోరుట్లలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, కమిషనర్ రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు మోర్తాడు లక్ష్మీనారాయణ, బలిజ పద్మా రాజారెడ్డి, బద్ది సుజాతా మురళి, గంధం గంగాధర్, పేర్ల సత్యం, గుండోజి శ్రీనివాస్, జిందం లక్ష్మీనారాయణ, అన్వర్, సజ్జు, అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, ఆలిండియా అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, బీఆర్ఎస్ నేతలు పుప్పాల ప్రభాకర్,ఆడెపు మధు, బాబా, రహీం, దాసరి రాజశేఖర్, మురళి, అంబేద్కర్ మాల, మాదిగ యువజన సంఘాల అధ్యక్షులు కంబ ఆనంద్, బలంతుల సురేశ్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- మరిమడ్లలో అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

కోనరావుపేట, డిసెంబర్ 6: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి మంచి గుర్తింపు పొందాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. కోనరావుపేట మండలం మరిమడ్లలోని ఏకలవ్య గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో రెండో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను బుధవారం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాపోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. తర్వాత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, సర్పంచ్ అశోక్, ప్రిన్సిపాల్ భాస్కర్, ఆర్‌సీవో వెంకన్న, నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి, తదితరులు ఉన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాయకులు, ఉపాధ్యాయులు

ఆశాజ్యోతి అంబేద్కర్

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, డిసెంబర్ 6: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మధురానగర్, బూరుగుపల్లి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ దూలం బాలగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, ఏఎంసీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, సర్పంచులు మడ్లపెల్లి గంగాధర్, ఎండీ నజీర్, నేతలు వేముల అంజి, దూలం శంకర్‌గౌడ్, నాగారపు సత్యనారాయణ, తోట మహిపాల్, వడ్లూరి ఆదిమల్లు, దోమకొండ మల్లయ్య, లింగాల దుర్గయ్య, గడ్డం స్వామి, దూలం బాలగౌడ్, కొలెపాక స్వామి, శ్రీనివాస్, హరిబాబు, అజయ్, ఉన్నారు.

మధురానగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు